క్లుప్తంగా

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించండి



తెనాలిఅర్బన్: విద్యార్థుల్లో సృజనాత్మకతను, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించాలని ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర కొలసాని రామ్‌చంద్ సూచించారు. బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ స్కూల్‌లో ప్రీ ప్రైమరీ విద్యార్థుల స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించాలన్నారు. చిన్నతనం నుంచే విలువలతో కూడిన విద్యను అలవాటు చేయాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో నెహ్రూనికేతన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



తెనాలి: పట్టణానికి చెందిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ డి3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బుర్రిపాలెంరోడ్డులోని డాక్టర్ ఎస్ ఎక్లేవ్ భవనం ఆవరణలో ప్రతినెల చివరి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్యశిబిరం కొనసాగించారు. పేర్లు నమోదు చేసుకున్న 300 మందికి సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ డి.శారద ఉచితంగా బీపీ, షుగరు, ఫిజియోథెరపీ పరీక్షలు చేశారు. ఈసీజీ తీశారు. అవసరమైన వారికి నెలకు సరిపడ బీపీ, కాల్షియం, విటమిన్ మందులు ఉచితంగా అందజేశారు. శిబిరానికి హాజరైన అందరికీ అల్పాహారం సమకూర్చారు. పావులూరి ట్రస్ట్ చైర్మన్ పావులూరి శ్రీనివాసరావు, పావులూరి భానుమూర్తి, శ్రీశైల భక్త సేవాసమితి సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

డాక్టరేట్ అందుకున్న పూర్ణ ప్రజ్ఞాచారి



తెనాలిరూరల్: హైదరాబాద్‌లోని తెలుగు సంస్కృతి సాంస్కృతిక సేవా సంస్థ ప్రదానం చేసిన గౌరవ డాక్టరేట్‌ను సాహితీరత్న నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి అందుకున్నారు. హైదరాబాద్ చిక్కడ్‌పల్లి త్యాగరాయ గాన సభావేదికపై ఆదివారం సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంజీ శంకర్, వేదాంత పండితులు సుబ్బరాయ శర్మ, ఉస్మానియా విశ్వవిద్యాలయ తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ కేసరి జనార్ధనరావు, కమెడియన్ అప్పారావులు పూర్ణ ప్రజ్ఞాచారికి గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. ఈ మేరకు వివరాలను ప్రజ్ఞాచారి వెల్లడించారు. తన తండ్రి మధురకవి నూతక్కి అబ్రహంకు డాక్టరేట్‌ను అంకితం చేస్తున్నట్టు తెలిపారు. తన స్వగ్రామం తెనాలి మండలం కొలకలూరు గ్రామ కళాకారులకు, కళాభిమానులకు, కళా పోషకులకు ఈ గౌరవం దక్కినట్లేనని పేర్కొన్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత

తెనాలిరూరల్: తెనాలి మండలం బుర్రిపాలెం, నందివెలుగు గ్రామాల కూడళ్లలో పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద బిల్లులు లేకుండా తరలిస్తున్న నగదును పోలీసులు ఆదివారం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బుర్రిపాలెం గ్రామం దగ్గర వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో చుండూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన తంగెళ్ళ ప్రసాద్‌రాజు బైక్‌లో రూ.లక్ష నగదు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నందివెలుగు చెక్ పోస్ట్ వద్ద ఇన్నోవా కార్లో వెళ్తున్న వేమూరుకు చెందిన కోగంటి శివజ్యోతి వద్ద రూ.1.20 లక్షలకు సరైన బిల్లులు చూపకపోవటంతో నగదును స్వాధీనం చేసుకున్నారు.

నేడు పలు వార్డులలో రోడ్డు షో

తెనాలిఅర్బన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం 4 గంటలకు తెనాలి పట్టణ పరిధిలోని 16, 17, 18, 19, 20 వార్డులలో రోడ్డు షో నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. రోడ్డు షోలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మేనిఫెస్టోతో పేదల జీవితాల్లో వెలుగులు

- అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా రూపకల్పన
- చంద్రబాబు మోసపూరిత హామీలు నమ్మి మోసపోవద్దు
- సీఎం వైఎస్ జగన్‌ది చేసిందే చెప్పే నైజం
- తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్
- కొల్లిపరలో ఎన్నికల ప్రచారం
- రోడ్ షోలో స్వచ్ఛందంగా పాల్గొన్న మహిళలు, యువత



కొల్లిపర రోడ్‌షో లో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్

కొల్లిపర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోతో ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగు పడతాయని దీన్ని అన్ని వర్గాల ప్రజలు స్వాగతిస్తున్నారని తెనాలి వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రం కొల్లిపర గ్రామంలో చేపట్టిన ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక నాయకులతో కలసి రోడ్ షో నిర్వహించారు. గ్రామంలోని యువత, మహిళలు, పార్టీ శ్రేణులు, ప్రజలు శివకుమార్‌కు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. ఎస్సీ నాయకులతో కలసి ప్రధాన కూడలిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ కాలనీలలో ఉన్న పలు చర్చిల్లో నాయకులతో కలసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఈ సందర్భంగా రోడ్ షో లో శివకుమార్ మాట్లాడుతూ సీఎం జగన్ విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రజలు స్వాగతిస్తున్నారన్నారు. ప్రజలకు ఏం చేయగలమో..ఎంత మంచి చేయొచ్చో అదే జగన్ చేస్తారన్నారు. నవరత్న పథకాలను మరింత మెరుగు పరిచి మేనిఫెస్టోలో పొందు పరిచారన్నారు. నిజాయతీతో నిర్భయంగా ఎన్నికలకు వెళ్దామని చెప్పే నైజం తమ నాయకుడిదన్నారు. పెన్షన్లు రూ.3500కు, రైతు భరోసాను రూ.50 వేల నుంచి రూ.80 వేలకు పెంచనున్నట్లు తెలిపారు. వైఎస్సార్ చేయూత సొమ్మును రెట్టింపు చేస్తామని చెప్పడం గొప్ప విషయమన్నారు. మేనిఫెస్టో నూటికి నూరు శాతం ఫలితాలు సాధిస్తుందని తప్పకుండా 175 కు 175 సీట్లు సాధించడం ఖాయమన్నారు.



కొల్లిపర చర్చిలో ఎస్సీ నాయకులతో కలసి ప్రార్థనలు నిర్వహిస్తున్న శివకుమార్

కొల్లిపర గ్రామంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో సంక్షేమం ద్వారా వేల కోట్ల రూపాయలు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేయటం జరిగిందన్నారు. అభివృద్ధిలో భాగంగా ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, గ్రామ సచివాలయం, వెల్‌నెస్ సెంటర్లు నిర్మించినట్లు, నాడు–నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం కోసం రూ.8.72 కోట్ల వ్యయంతో సామాజిక ఆరోగ్య కేంద్రంలో నూతన భవనం నిర్మించి అత్యాధునిక వైద్య పరికరాలతో అన్ని వైద్య సదుపాయాలు సమకూర్చి నేడు ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందిచటం జరుగుతుందన్నారు. గ్రామంలో గతంలో ఇంత అభివృద్ధి చేసిన ప్రభుత్వం ఉందా అని ప్రశ్నించారు. ఇంత అభివృద్ధి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలు రానున్న ఎన్నికల్లో తమ ఓటు వేసి వారి అభిమాన్ని చాటుకోవాలని కోరారు.

మే13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు, ఎంపీగా కిలారి వెంకటరోశయ్యకు రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి గుదిబండి చిన్న వెంకటరెడ్డి, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు మందపాటి శేషగిరిరావు, ఎంపీపీ భీమవరపు పద్మావతి సంజీవరెడ్డి, సర్పంచ్ పిల్లి రాధిక, పార్టీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, పార్టీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ అవుతు శేకరరెడ్డి , సొసైటీ అధ్యక్షులు ఆరిమళ్ళ కృష్ణారెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు ఈదా యశ్వంత్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల శివారెడ్డి, మండల ఎస్సీ విభాగం అధ్యక్షులు ఎ.సురేష్, ఎంపీటీసీలు కె.శ్రీలత, సిహెచ్ ఝాన్సీ, వైఎస్సార్ సీపీ గ్రామ నాయకులు కళ్లం వీరారెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, ఆరిమండ కృష్ణారెడ్డి(గుడివిల్), మండ్రు రాజు, పిల్లి గంగాధర్ , భీమవరపు చిన్న రామిరెడ్డి, షేక్ బాషా, షేక్ అబ్దుల్లా, షేక్ రహీమ్, గుదిబండి కృష్ణకిషోర్‌రెడ్డి, లంకిరెడ్డి సుధాకరరెడ్డి, వార్డు మెంబర్‌లు, కార్యర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి తొలి ప్రాధాన్యం

- ఎమ్మెల్యే అభ్యర్థి సతీమణి పుష్ప, చైర్‌పర్సన్ రాధిక
- 15వ వార్డులో ప్రారంభమైన ఎన్నికల ప్రచారం



ఎన్నికలకు సిద్ధమంటున్న పుష్ప, రాధిక, కోటేశ్వరరావు

తెనాలిఅర్బన్: ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రధాన అజెండా అని వైఎస్సార్ సీపీ తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికలు పేర్కొన్నారు. 15వ వార్డు ముత్తంశెట్టి పాలెంలోని బాబా టవర్స్ నుంచి ఆదివారం సాయంత్రం ఎన్నికల ప్రచారం ప్రారంభమైంది. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసే కరపత్రాలు పంపిణీ చేశారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ అత్తోట నాగవేణి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, 15వ వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గుంటూరు గోపి, చెన్నుపాటి శ్రీనివాసరావు(పసి), కావేటి నిర్మల, తాడిబోయిన రమేష్, చుండూరు వెంకటేశ్వరరావు, చుక్కా ఆనంద్, మేడేపల్లి ప్రభాకర్, సుంకర కొండలరావు, శంకర్, సురుకుల వెంకట్రావు, లక్ష్మణశాస్త్రి, డిపో నాగరాజు, పెద్ద సంఖ్యలో 15వ వార్డు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అంగలకుదురులో జోరుగా ప్రచారం

తెనాలిరూరల్: టీడీపీ కంచుకోట అయిన తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం ఆదివారం జోరుగా సాగింది. అంగలకుదురు పల్లెలో వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం చేస్తున్న ఆయన పెద్ద కుమారుడు అన్నాబత్తుని సత్యనారాయణ చౌదరికి పల్లెవాసులు ఘనస్వాగతం పలికారు. కొబ్బరికాయల కొట్టి దిష్టి తీసిన మహిళలు దారి పొడవునా పూల వర్షం కురిపించారు. ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకే ఓటేయాలని కోరారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, గ్రామ పార్టీ అధ్యక్షులు బండి హైమారావు, ఎంపీటీసీ ముప్పవరపు సంధ్యారాణి, కడియాల సురేష్, మొవ్వ ఆనంద్, ముప్పవరపు మల్లి, ఉరిటి మల్లి, ఉరిటి నాగేశ్వరరావు, తోట శ్రీకాంత్, షేక్‌బాదుల్లా, షేక్ మీరాసా, సాధు ఏడుకొండలు, విజయ్, చుండూరు గోపి, కిరణ్ చంద్ర, నరేష్, జి. ప్రసన్నకుమారి, చిలకా సుమతి, మూకర వీరయ్య తదితరులు ఉన్నారు.

జనసేనను వీడి వైఎస్సార్ సీపీలో చేరికలు

పార్టీ కండువాలను కప్పి స్వాగతించిన ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: తెనాలి అసెంబ్లీకి కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ వ్యవహార శైలి కార్యకర్తలను అవమానపరచేలా ఉందని రూరల్ మండల గ్రామం హాఫ్‌పేట సర్పంచ్ తలమాల యర్రయ్య అన్నారు. ఆ గ్రామానికి చెందిన జనసేన, టీడీపీకి చెందిన పలువురు కార్యకర్తలు యర్రయ్య ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వీరికి పార్టీ కండువాలను కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా యర్రయ్య మాట్లాడుతూ నాదెండ్ల మనోహర్ ఇంతకాలం కార్యకర్తలకు అందుబాటులో లేరని ఇకపైనా అందుబాటులో ఉండగలరన్న నమ్మకం లేదన్నారు. పేదవర్గాల ప్రజలకు మేలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి విధానాలు, లోకల్ శివన్నపై నమ్మకంతో గ్రామానికి చెందిన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలోకి వచ్చినట్టు తెలిపారు. పార్టీలో చేరినవారిలో కనపర్తి రాజేష్, డొక్కుమళ్ల భరత్‌చంద్ర, కొలనుకొండ షాలేమురాజు, వల్లూరు ఏడుకొండలు, వేమూరు శివాజీ, వేమూరు రవికుమార్, తలమాల సుందరరావు, పిల్లి సురేష్, దేవరపల్లి బాబు, దర్శి అఖిల్, దేవరపల్లి సన్ని, జ్యోతుల బబ్లూ ఉన్నారు.

తెనాలి: పట్టణ 28వ వార్డుకు చెందిన జనసేన, టీడీపీ పార్టీల క్రియాశీల కార్యకర్తలు సయ్యద్ ఆశిక్, గండికోట సాంబశివరావు వారి మిత్రబృందం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వార్డు కౌన్సిలరు, వైఎస్సార్ సీపీ నేత యాతాటి అనిల్ ఆధ్వర్యంలో వీరంతా ఆదివారం సాయంత్రం గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సమక్షంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్యే శివకుమార్ వీరికి పార్టీ కండువాలను కప్పి స్వాగతం పలికారు.



పార్టీలో చేరిన వారితో శివకుమార్, తలమాల యర్రయ్య



పార్టీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలతో శివకుమార్

రూ.1.20 లక్షల నగదు స్వాధీనం

తాడికొండ: ఎలాంటి రసీదులు లేకుండా ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రూ.1.20 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం తాడికొండ మండలం కంతేరు శ్రీ సిటీ సమీపంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు నిర్వహిస్తుండగా పెదకాకాని మండలం కొప్పురావూరు గ్రామానికి చెందిన వరగాని భానుచందర్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై రూ.1.20 లక్షల నగదు పెట్టుకొని వెళ్తుండగా తనిఖీలు నిర్వహించారు. నగదుకు సంబంధించి ఎలాంటి రసీదులు లేని కారణంగా తాడికొండ పోలీస్ స్టేషన్‌లో అప్పగించి, ఐటీ అధికారులకు పంపించినట్లు సీఐ తెలిపారు.

డొక్కా ఆరోపణలు అర్ధ రహితం

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుంటూరు కృష్ణ

తెనాలి: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు ప్రజా సేవకులుగా పని చేశారని జన్మభూమి కమిటీలు, రాజధాని నిర్మాణం, కాంట్రాక్టర్ల పేరుతో ప్రజల డబ్బు దోచుకోలేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి గుంటూరు కృష్ణ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని ప్రజలకు చేర్చేందుకు ఎమ్మెల్యేలు నిరంతరం పాటు పడినట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీని వీడి టీడీపీలో చేరిన సందర్భంగా డొక్కా మాణిక్య వరప్రసాద్ పార్టీ ఎమ్మెల్యేలపై విమర్శలు చేయటం అర్ధ రహితమని ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. టీడీపీ హయాంలో ఆ పార్టీ ఎమ్మెల్యేలు పలువురు మట్టి, ఇసుక, కంకర దోపిడీ చేసిన విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి ప్రజలను, ప్రజా ప్రతినిధులను ఎప్పుడు..ఎక్కడ..ఎలా కలవాలో తెలుసునని, వారికి సూచనలు, సలహాలు ఇచ్చే స్థాయి మాణిక్యవరప్రసాద్‌కు లేదన్నారు.

మే ఒకటిన కవి సమ్మేళనం

నగరంపాలెం: ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం , గుంటూరు జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మే ఒకటో తేదీన సోమేపల్లి వెంకటసుబ్బయ్య జయంతి, కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు జిల్లా రచయితల సంఘం కార్యదర్శి ఎస్ఎం సుభాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బృందావన్‌గార్డెన్స్ అన్నమయ్య గ్రంథాలయ ఆవరణలో సమ్మేళనం నిర్వహించనున్నట్లు చెప్పారు.

వివాహ పరిచయ వేదికకు స్పందన



సేవకులను సత్కరించిన నిర్వాహకులు

తెనాలిఅర్బన్: ది పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముత్తెంశెట్టిపాలెంలోని కల్యాణ మండపంలో ఆదివారం వివాహ పరిచయ వేదికను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో పద్మశాలీయ యువతీ, యువకులు హాజరయ్యే పరిచయ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు జొన్నాదుల నరసింహారావు మాట్లాడుతూ పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. వధూవరుల వివాహ పరిచయ వేదికకు వివిధ ప్రాంతాల్నుంచి 246 మంది యువతీ యువకులు తల్లిదండ్రులతో సహా హాజరయ్యారు. కొందరు సంప్రదింపులు జరుపుకున్నారు. ఇదే వేదికపై వధూవరుల వివరాలు తెలియజేసే పుస్తకాన్ని ఆవిష్కరించారు. నిత్య అన్నదానం నిర్వహిస్తున్న పంచుమర్తి బాలచంద్రుడు, తిరువీధుల మల్లికార్జునరావు, గవని సతీష్‌బాబు దంపతులను ఘనంగా సత్కరించారు. పద్మశాలి వెల్ఫేర్ సొసైటీకి చెందిన శిల్పి అక్కల శ్రీరామ్ నిత్యాన్నదానం చేస్తున్నందుకు అభినందించారు. ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామ్‌చంద్, సంస్థ ప్రతినిధులు జొన్నాదుల మహేష్, అక్కల శ్రీరామ్, దివి పురుషోత్తం, గంజి ప్రభాకరరావు, శేషగిరిరావు, ఓంకార ప్రసాద్, పరమేశ్వరరావు, నరేంద్రబాబు, మదన్‌మోహన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో విద్యార్థులతో అతిథులు

తెనాలి: పట్టణ సుల్తానాబాద్‌లోని సరస్వతి శిశుమందిర్ విద్యార్థులకు శనివారం రాత్రి గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరిగిన వేడుకకు శిశుమందిర్ సంచాలిత సమితి అధ్యక్షుడు డాక్టర్ సామల లక్ష్మణబాబు అధ్యక్షత వహించారు. గౌరవ అధ్యక్షుడు కొత్త సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, విద్యాపీఠం విజయవాడ సమితి కార్యదర్శి కొసనం జగదీష్ సందేశాన్ని వినిపించారు. పాఠశాల కరస్పాండెంట్ కోడూరు రమాదేవి స్వాగతం పలికారు. విద్యాకమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి హనుమంతరావు పర్యవేక్షించారు. విద్యాకమిటీ కార్యదర్శి దూళ్ల నరసింహారావు, కమిటీ సభ్యులు యక్కల శ్రీమన్నారాయణ, పొత్తూరు నాగేంద్రం, అవ్వారు లత, కొత్త దీప్తి, కాజా శివప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందు విద్యార్థులు సాంస్కృతిక అంశాలను ప్రదర్శించారు.

భావ వ్యక్తీకరణకు భాష కీలకం



ఆచార్య కృపాచారిని సత్కరించిన అసోసియేషన్ నేతలు

తెనాలి: అక్షరం భాషకు ప్రాణం పోస్తుందని, అలాంటి భాషను అచ్చుయంత్రం అజరామరం చేసిందని దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి అన్నారు. స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్లో ఆదివారం రాత్రి సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన సమావేశానికి అధ్యక్షుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షత వహించారు. 'మానవ వికాసంలో ముద్రణా వికాసం' అనే అంశంపై ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి ప్రత్యేక ప్రసంగం చేశారు. మానవ వికాసంలో భాష ప్రాధాన్యత, అందుకు తోడ్పడిన ముద్రణా పరిణామాన్ని సోదాహరణంగా వివరించారు. అనంతరం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ కార్యదర్శి ప్రసాదం పూర్ణచంద్రరావు, చలమయ్య, వాకా పేరిరెడ్డి, అజ్గర్‌అలీ పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థినులకు అభినందన



గుంటూరు ఎడ్యుకేషన్: ఇటీవల విడుదలైన టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు కన్న మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం ఎన్టీఆర్ స్టేడియం వద్ద సన్మానించారు. నగరానికి చెందిన అరసపల్లి వెంకట కోటేశ్వరరావు తనయ మోహనశ్రీ టెన్త్‌లో 589 మార్కులతో పాటు సయ్యద్ అహ్మద్ తనయ ఆఫ్రిన్ టెన్త్‌లో 583 మార్కులు సాధించినట్లు కన్నా మిత్ర మండలి అధ్యక్షుడు జి.కన్న తెలిపారు. అదే విధంగా అరసపల్లి రాధాదేవి సీనియర్ ఇంటర్‌లో 981 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఈసందర్భంగా కన్నా మాట్లాడుతూ సాధారణ కుటుంబాలకు చెందిన విద్యార్థులు టెన్త్; ఇంటర్‌లలో అత్యుత్తమ ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మిత్ర మండలి సభ్యులు సాంబశివరావు, గుంటక శ్రీనివాసరెడ్డి, గురువారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పొట్టి నాగేశ్వరరావు, శ్రీహరి, ఆదినారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ ప్రతిభా పురస్కారాలు



విద్యార్థినికి ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న ఫ్రాన్సిస్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ– జేఈఈ, నీట్ అకాడమీ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు ఆదివారం ప్రదానం చేశారు. స్థానిక చంద్రమౌళీనగర్‌లోని అకాడమీ క్యాంపస్ వద్ద నిర్వహించిన ప్రతిభా పురస్కార్ మహోత్సవంలో భాగంగా విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఎస్.ఫ్రాన్సిస్‌రెడ్డి ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో 570కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ఆహ్వానించి, సత్కరించడం ద్వారా వారిలో స్ఫూర్తిని నింపినట్లయిందని అన్నారు. ఈసందర్భంగా కార్యక్రమానికి హాజరైన 500 మంది విద్యార్థులను సత్కరించి, ప్రతిభాపత్రం, షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎస్. విజయభాస్కర్ రెడ్డి, జోసఫ్‌రెడ్డి, డీన్ కె. సాంబశివరావు, ఏజీఎం ఏడుకొండలు, సీఈవో సన్నీ, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ అమీనాబేగం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని అన్నమయ్య కళా వేదికపై శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ నిర్వహిస్తున్న అంతర్జాతీయ నృత్య దినోత్సవం(మహా మంజీరనాదం–2024) ఆదివారం ఆరో రోజుకి చేరాయి. ప్రముఖ గాయని పత్రి నిర్మలమదన్ జ్యోతిప్రజ్వలన చేయగా, సభకు డాక్టర్ భూసురపల్లి వేంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. అనంతరం మొహిముద్దీన్‌ఖాన్ (ప్రొద్దుటూరు) నృత్య ప్రదర్శన, అభిశ్రీ మోల్ (తిరువనంతపురం) మోహినీ ఆట్టం, రుత్విక నలమలవు(కర్ణాటక) కూచిపూడి నాట్యం, కె.హరిప్రసాదరావు(తిరుపతి) భరతనాట్యం ప్రదర్శించారు. వారి నృత్యాలు సభికులు, ప్రేక్షకులను అలరించాయి. మొహిముద్దీన్‌ఖాన్‌కు నృత్య శిరోమణి పురస్కారం, కొందరికి యువ కళారత్న పురస్కారాలు, ఎస్వీ సంగీత నృత్య కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ ఎస్. జమునా రాణికి 'మరంగంటి కాంచన మాల' జీవిత సాఫల్య పురస్కారం, ప్రపంచ ప్రఖ్యాత నాట్యా చార్యుడు డాక్టర్ ఎస్.కృష్ణకుమార్‌ను పసుమర్తి కృష్ణమూర్తి జీవిత సాఫల్య పురస్కారంతో ఘనంగా సత్కరించారు. సభలో ప్రముఖ వైద్యులు, రచయిత్రి భార్గవి, వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ కాజ వెంకట సుబ్రహ్మణ్యం, సంస్థ కార్యదర్శి వెంకటగిరి నాగలక్ష్మి, బిక్కి అలేఖ్య పాల్గొ న్నారు.

వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: వ్యక్తి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. మల్లికార్జునపేట 5వ లైన్‌లో నివాసించే సిహెచ్.శ్రీనివాసరావు(47) అప్పులబాధతో ఆదివారం బాత్‌రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీ త్యాగరాజస్వామి కళావేదికపై ఆదివారం రాత్రి శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నెల వారి కార్యక్రమంలో భాగంగా యువ కళాకారులతో శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. కుమారి మల్లాది సింధురాగేశ్వరి శ్రీత్యాగరాజస్వామి కీర్తనలు, వాగ్గేయకార కీర్తనలను శ్రావ్యంగా అలరించారు. వయోలిన్‌పై కె.కామాక్షి(విజయవాడ), మృదంగంపై మల్లాది శివానంద యశస్వి వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతరం కళాకారులను సంస్థ కార్యదర్శి వల్లూరి కృష్ణకిషోర్, ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్, కోశాధికారి రవీంద్రనాథ్ సత్కరించారు.